www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

## మరో నాలుగు రోజుల పాటు వర్షాలు



**హైదరాబాద్ మే 19(సిద్దిపేట పవర్) :**

బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది.

సంపుటి: 01 | సంచిక: 62 | హైదరాబాద్ | మంగళవారం | 20-05-2025 | పేజీలు: 04 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## మంత్రి పదవి కోసం కొత్త ఎత్తులు..

సీనియర్లతోనూ సత్సంబంధాలు

మారిన వైఖరిపై కాంగ్రెస్‌లో చర్చ



2

## కాళేశ్వరం కమిషన్ గడువు మరోసారి పొడిగింపు



కాళేశ్వరం కమిషన్ గడువు మరో రెండు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు

మే 31తో ముగియనున్న కమిషన్ పదవీ కాలం

బహిరంగ విచారణను ముగించినట్లు ప్రకటించిన కమిషన్ వర్గాలు

గడువును జూలై 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ



2

## అందాల పోటీలకైతే 300 కోట్లు.. పుష్కరాలకు రూ.35 కోట్లేనా?

12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కారాలు

పుష్కర స్నానం చేయడం చాలా సంతోషంగా ఉంది

ప్రభుత్వం పెద్ద పుష్కర పండగకు రూ.35 కోట్లిచ్చింది

అందాల పోటీలకు మాత్రం రూ. 300 కోట్లు విడుదల చేశారు

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు



2

## జ్యోతి మల్హోత్రా తండ్రి ఏమన్నారంటే?

హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్టు

పాక్ తరపున గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలు

జ్యోతి మల్హోత్రా గురించి సంచలన విషయాలు బయటపెట్టిన తండ్రి..

వెలుగులోకి అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు





2

# వరి వేస్తే ఉరి కాదు.. వరి వేస్తే సిరి!

రాష్ట్రంలోని ఆ ఐదారుగురు సన్నాసుల గురించి పట్టించుకోను..

ఇందిరా గాంధీ లాంటి పౌరుషం ఉన్న ప్రధాని దేశానికి కావాలి

50 ఏండ్ల తర్వాత కూడా ప్రతి ఒక్కరి గుండెల్లో ఇందిరమ్మ ఉంది

పెహల్గం దాడి తర్వాత.. ఇందిరమ్మ లాంటి ప్రధాని కావాలని కోరుతున్నారు

'ఇందిర సౌర గిరి జల వికాసం' ప్రారంభ సభలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు





**హైదరాబాద్ మే 19(సిద్దిపేట పవర్):**

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు జరిగిన అన్యాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో పర్యటించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీతక్క, జూపల్లి కృష్ణారావుతో కలిసి ''ఇందిర సౌర గిరి జల వికాసం'' పథకాన్ని ప్రారంభించారు. రూ.12,600 కోట్లతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో యూనిట్‌కు రూ.6 లక్షల చొప్పున వంద శాతం సబ్సిడీతో లబ్ధిదారులకు లాభం చేకూరనుంది. ముందుగా సీతారామాంజనేయ ఆలయాన్ని

...మిగతా 2లో



## గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం వెనుక అక్రమ కరెంట్ కనెక్షన్..!

హైటెన్షన్ వైర్ నుంచి కొక్కేల ద్వారా కరెంట్ తీసుకున్న స్థానికులు

ఈ అక్రమ కరెంట్‌తో బాధిత కుటుంబం కరెంట్ మీటర్‌పై లోడ్

ఆ కరెంట్ లోడ్‌తో బాధిత కుటుంబం మీటర్‌బాక్స్‌లో మంటలు

**హైదరాబాద్ మే 19(సిద్దిపేట పవర్):**

హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్‌హౌస్ ప్రాంతంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదం మృత్యుపాశాన్ని మోసుకొచ్చింది. ఈ ఘటనపై పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రాథమికంగా చేసిన దర్యాప్తులో ఓ కీలక విషయాన్ని బయటపెట్టింది. ఆ విషాదానికి మూలంగా అక్రమ కరెంట్ కనెక్షన్ ఉన్న ఉన్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రభావిత భవనానికి ఎదురుగా ఉన్న నగల దుకాణం రాత్రి మూతపడిన అనంతరం, అక్కడి కొన్ని కుటుంబాలు హైటెన్షన్ వైర్ నుంచి కరెంట్‌ను కొక్కేల ద్వారా అక్రమంగా వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ లైన్‌ను ఉపయోగిస్తూ బాధిత కుటుంబం ఇంటి కరెంట్ మీటర్‌పై ఎక్కువ లోడ్ పడినట్లు

...మిగతా 2లో

ప్రజలపై భారం మోపినా ఫలితం శూన్యం..

# కొత్త ఇసుక పాలసీ బూమరాంగ్!

సర్కారుకు రూ.100 కోట్లు తగ్గిన ఆదాయం

అధికారులపై సీఎం రేవంత్‌రెడ్డి చిర్రుబుర్రు

పాలసీపై పునరాలోచనలోపడ్డ అధికారులు?



2

## హైడ్రా డ్రైవర్ ఉద్యోగాలకు పోటెత్తిన యువత..

- హైడ్రా పార్కింగ్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరిన యువత
- హైడ్రాలో ఔట్స్ సోర్సింగ్ పద్దతిలో డైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరణ
- నేటి నుంచి రెండు రోజులపాటు దరఖాస్తులు స్వీకరించనున్న హైడ్రా
- కానిస్టేబుల్ పరీక్షలో స్వల్ప మార్కులతో తేడాతో దూరమైన వారికి ప్రాధాన్యత



2


WWW.SIDDIPETPOWER.COM

# జ్యోతి మల్హోత్రా తండ్రి ఏమన్నారంటే?

- హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్టు
- పాక్ తరపున గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలు
- జ్యోతి మల్హోత్రా గురించి సంచలన విషయాలు బయటపెట్టిన తండ్రి..
- వెలుగులోకి అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు

**హర్యానా మే 19(సిద్దిపేట పవర్):**

హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్టు అందరినీ ఆశ్చర్య పరిచింది. పాకిస్థాన్ తరపున గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై అరెస్టు అనంతరం అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. జ్యోతి పాకిస్థాన్, చైనాతో సహా అనేక దేశాలకు ప్రయాణించిందని చెబుతున్నారు. కేవలం రూ.20,000 ఉద్యోగంతో జీవితం ప్రారంభించిన జ్యోతి, ఇప్పుడు ప్రసిద్ధ యూట్యూబర్‌గా మారింది. కానీ ఆమెను ఎందుకు అరెస్టు చేశారు? విదేశాలకు వెళ్ళే ముందు ఆమె తన కుటుంబానికి ఏమి చెప్పింది? పాకిస్థానీ స్నేహితుల గురించి కుటుంబానికి తెలుసా? ఇలాంటి అనేక ప్రశ్నలను జ్యోతి తండ్రి హరీష్ మల్హోత్రా మాటల్లో తెలుసుకుందాం..

**ప్రశ్న:** మీ కూతురిని ఎందుకు అరెస్టు చేసి తీసుకెళ్లారని మీరు అనుకున్నారు? ఆ సమయంలో మీరు ఇంట్లో ఉన్నారా?

**జ్యోతి తండ్రి:** నేను ఇంట్లో లేను. గురువారం పోలీసులు జ్యోతి తీసుకెళ్లారు. ఆమెకు సంబంధించిన వస్తువులను కూడా తీసుకెళ్లారు.

**ప్రశ్న:** మరి ఇదంతా ఎందుకు జరుగుతోంది. ఇంతకీ ఏం చేశావని మీరు జ్యోతిని అడిగారా?

**జ్యోతి తండ్రి:** అడిగినా.. ఆమె నాకు ఏం చెప్పలేదు.

**ప్రశ్న:** ఇదంతా జరుగుతుంటే.. ఓ తండ్రిగా మీకు భయం వేయలేదా?

**జ్యోతి తండ్రి:** నేను చాలా ఆందోళన చెందాను. భయం వల్ల నాకు నిద్ర కూడా పట్టలేదు. ఈ విషయాలు బయటకు వచ్చిన తర్వాత నాకు జ్వరం కూడా వచ్చింది.

**ప్రశ్న:** జ్యోతి మీతో ఏదైనా చెప్పే ఉంటుంది కాదా?

జ్యోతి తండ్రి: "నాన్న, ఏదో తప్పు జరిగింది. పరిస్థితి అంతా బాగానే ఉంది. మీరు దిగులు చెందకండి." అని చెప్పింది. ఇంకేమీ చెప్పలేదు.

**ప్రశ్న:** ఒక తండ్రిగా ఆమె మీకు చెప్పాల్సిన అవసరం ఉంది కాదా? చెప్తే మీరు బాధపడతారని ఆమె అనుకుందా?

**జ్యోతి తండ్రి:** అవును, అదే అయి ఉండవచ్చని అనుకుంటున్నా..





# గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం వెనుక అక్రమ కరెంట్ కనెక్షన్..!

**మొదటిపేజీ తరువాయి**

తెలుస్తోంది. ఆలోచించదగ్గ విషయమేమంటే, అదే లోడ్ కారణంగా మీటర్‌బాక్స్‌లో మంటలు చెలరేగినట్టు.. ఆ మంటలు మొదట మీటర్ బాక్స్‌లో వచ్చి, ఆ బాక్స్ పక్కన ఉన్న ఉడెన్ షోకేజ్‌ను అంటుకున్నాయి.

అక్కడ నుంచి మంటలు మరింతగా వ్యాపించి ఏసీ కంప్రెసర్ వరకు తాకాయి. అప్పటికే భవనం పై అంతస్తుల్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు ఏమీ గ్రహించకుండానే మంటలు ఇంటి అంతటా విస్తరించాయి. ఈ ప్రమాదానికి కారణమైన అక్రమ కరెంట్ కనెక్షన్లపై పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. హైటెన్షన్ లైన్ల నుంచి వ్యక్తిగతంగా కరెంట్ తీసుకోవడాన్ని గమనించి, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో స్థానికంగా మరిన్ని ఇలాంటి అక్రమ కనెక్షన్లున్నాయా అనే దానిపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనతో చిన్నచిన్న నిబంధనల ఉల్లంఘన ఎంతటి ప్రాణ నష్టం కలిగించగలదో మరోసారి తేలిపోయింది. అక్రమ కరెంట్ కనెక్షన్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఇంకా తీవ్రమైంది.





# అందాల పోటీలకైతే 300 కోట్లు.. పుష్కరాలకు రూ.35 కోట్లేనా?

- 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కారాలు
- పుష్కర స్నానం చేయడం చాలా సంతోషంగా ఉంది
- ప్రభుత్వం పెద్ద పుష్కర పండగకు రూ.35 కోట్లిచ్చింది
- అందాల పోటీలకు మాత్రం రూ. 300 కోట్లు విడుదల చేశారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు

**హైదరాబాద్ మే 19(సిద్దిపేట పవర్):**

12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కారాల స్నానం చేయడం చాలా సంతోషంగా ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద పుష్కర పండగకు విడుదల చేసిన 35 కోట్ల రూపాయలు ఏర్పాట్లకు సరిపోవన్నారు. యూపీ రాష్ట్రంలో కుంభమేళా కు 50 కోట్ల మందికి బీజేపీ ప్రభుత్వం సరిపడ నిధులు విడుదల చేసి ఘనంగా నిర్వహించిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పుష్కరాలను కుంభమేళ తరహాలో కోట్లాది మందిని తరలించి ఘనంగా నిర్వహించే వాళ్ళమని చెప్పారు. అందాల పోటీలకు రూ. 300 కోట్లు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్యాత్మికతకు రూ. 35 కోట్లు వెచ్చించడం ఏంటి? అని ప్రశ్నించారు.

పుష్కరాలను ఈ ప్రాంతానికి పరిమితి చేయడం పద్ధతి కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. వచ్చే పుష్కరాలకు ఎక్కువ బడ్జెట్ విడుదల చేసి ఘనంగా నిర్వహించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడంతో కాళేశ్వరానికి చెడ్డపేరు వచ్చిందని.. పుష్కరాలతోనైన మంచి పేరు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ముక్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం కోట్లు వెచ్చించిన నిధులు విడుదల చేయలేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన రూ. 200 కోట్ల హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# కొత్త ఇసుక పాలసీ బూమరాంగ్!

- ప్రజలపై భారం మోపినా ఫలితం శూన్యం..
- సర్కారుకు రూ.100 కోట్లు తగ్గిన ఆదాయం
- అధికారులపై సీఎం రేవంత్‌రెడ్డి చిర్రుబుర్రు
- పాలసీపై పునరాలోచనలోపడ్డ అధికారులు?

**హైదరాబాద్ మే 19(సిద్దిపేట పవర్):**

కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్టుగా మారింది ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఇసుక పాలసీ. నూతన విధానంతో భారీ ఆదాయం వస్తుందన్న ప్రభుత్వ పెద్దలు, అధికారులు మాటలు తప్పని తేలిపోయింది. ఖజానాకు కాసుల గలగల ఏమోగానీ వెలవెలబోయేలా చేసింది. కొత్త ఇసుక పాలసీ తలకిందులైంది. భారీ రాబడి సంగతి పక్కన పెడితే ఆదాయం తగ్గిపోయింది. ప్రజలపై టన్ను ఇసుకకు రూ.500 వరకు అదనపు భారం మోపినప్పటికీ ప్రభుత్వానికి రావాల్సినంత ఆదాయం రాలేదు. నిరుడితో పోల్చుకుంటే రూ.100 కోట్లకుపైగా ఆదాయం తగ్గిపోయింది. అధికారుల అత్యుత్సాహం ఫలితంగా ఇసుకకు కృత్రిమ కొరత ఏర్పడి నిర్మాణ రంగంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడింది... కొత్త ఇసుక పాలసీ బెడిసికొట్టింది.

**సర్కారు అత్యుత్సాహం.. తగ్గిన ఆదాయం**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక అమ్మకం ద్వారా టీజీఎండీసీకి ఏటా సుమారు రూ.800 కోట్లకు పైగా ఆదాయం సమకూరేది. మార్కెట్‌లో ఎప్పుడూ ఇసుకకు కొరత ఏర్పడలేదు. బహిరంగ మార్కెట్‌లో పుష్కలంగా ఇసుక లభించేది. ఇసుక సరఫరాదారుల మధ్య పోటీ ఉండడంతో ఇసుక ధర టన్నుకు రూ.1,400 దాటలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిస్థితి తారుమారైంది. అక్రమాలను అరికడతామంటూ ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీ తీసుకొచ్చింది. తనిఖీల పేరుతో ఇసుక క్వారీలు సజావుగా నడవకుండా చేశారు. ఇసుక లారీలపై ఆంక్షలు విధించారు. వినియోగదారులే నేరుగా బుకింగ్‌లు చేసుకోవాలనే నిబంధన విధించారు. ఆన్‌లైన్ బుకింగ్‌లు జరగకుండా సాంకేతిక సమస్యలు సృష్టించి దళారులను రంగంలోకి దింపారు. ఇసుకబజార్లను ఏర్పాటుచేసి అధికారికంగానే రూ.1,800 ధర ఖరారు చేశారు. జీఎస్టీ, రవాణా ఖర్చులు కలుపుకొని టన్ను ఇసుక ధర రూ.2,000 దాటిపోయింది. ఒకప్పుడు రూ.1,400లకు ఇంటి వద్దకు చేరాల్సిన ఇసుకకు ఇప్పుడు రూ.2,000 ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. అయినా గతంలో మాదిరిగా అందుబాటులో ఉండడంలేదు. శాండ్‌బజార్లలో నాసిరకం ఇసుకను ఉంచడంతో వినియోగదారులకు నాణ్యమైన ఇసుక దొరకడమే గగనమైంది. కొత్త ఇసుక పాలసీ బెడిసికొట్టినా ప్రభుత్వంలో చలనం రాలేదని నిర్మాణరంగ నిపుణులు విమర్శిస్తున్నారు. ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నా ప్రభుత్వం స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

**ధర పెరిగినా తగ్గిన ఆదాయం**

ప్రభుత్వం వినియోగదారులపై భారం మోపినా ఖజానాకు రాబడి మాత్రం పెరగలేదు. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లకుపైగా ఆదాయం తగ్గిపోయింది. ప్రతినెలా సగటున రూ.70కోట్ల వరకూ ఆదాయం రావాల్సి ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నెల అయిన ఏప్రిల్‌లో రూ. 40 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది.

**పునరాలోచనలో అధికారులు**

శనివారం టీజీఎండీసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఇసుక ఆదాయం తగ్గడంపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. కొత్త పాలసీ తీసుకొచ్చిన ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు పరిస్థితి తలకిందులు కావడంతో తమను బాధ్యులు చేయడమేంటని కొందరు అధికారులు వాపోతున్నారు. ఆదాయం ఎలా పెంచాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. శాండ్ బజార్లలో ఇసుక ధరలు తగ్గించాలా? బహిరంగ మార్కెట్‌లో ఇసుక మరింత అందుబాటులోకి వచ్చేలా చేయాలా? అని అధికారులు ఆలోచనలో నిమగ్నమైనట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం, అధికారులు ఇసుక కృత్రిమ కొరతను సృష్టించడం మానుకోవాలని ప్రజలు, నిర్మాణదారులు కోరుతున్నారు.

**మధ్యతరగతి బడ్జెట్ తారుమారు**

ఇసుక ధర రూ.2,000లకు చేరుకోవంతో భవన నిర్మాణాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతున్నది. బడా బిల్డర్లు వినియోగదారులపై భారంమోపి తమ ఖర్చులు రాబట్టుకుంటారు. కానీ వ్యక్తిగత గృహాలు నిర్మించుకునే మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తారుమారవుతున్నది. చాలామంది నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేస్తున్నారు. 100 గజాల్లో రెండు గదుల ఇల్లు నిర్మించుకునేవారిపై సైతం ఇసుక ధర పెరగడంవల్ల రూ.లక్షకుపైగా అదనపు భారం పడినట్టు చెప్తున్నారు.

# హైడ్రా డ్రైవర్ ఉద్యోగాలకు పోటెత్తిన యువత..

- హైడ్రా పార్కింగ్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరిన యువత
- హైడ్రాలో ఔట్స్ సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరణ
- నేటి నుంచి రెండు రోజులపాటు దరఖాస్తులు స్వీకరించనున్న హైడ్రా
- కానిస్టేబుల్ పరీక్షలో స్వల్ప మార్కులతో తేడాతో దూరమైన వారికి ప్రాధాన్యత

**హైదరాబాద్ మే 19(సిద్దిపేట పవర్):**

ఇటీవల తెలంగాణలోని హైడ్రా సంస్థ (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొడక్షన్ ఏజెన్సీ).. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 200 డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి బుధవారం (మే 19, 21) వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపింది. ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలు రాసి.. స్వల్ప మార్కుల తేడాతో దూరమైన వారికీ ప్రాధాన్యత ఇస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీంతో రాష్ట్రంలోని నిరుద్యోగులు ఒక్కసారిగా పోటెత్తారు. హైడ్రా పార్కింగ్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరారు.

ఈ ఉద్యోగాలకు అప్లై చేసుకునేందుకు అన్ని జిల్లాల నుంచి భారీగా యువత తరలి వచ్చారు. ఇవాళ ఉదయం 10 గంటల నుంచి క్యూలైన్లో నిలబడి దరఖాస్తు చేసుకున్నారు. హైడ్రా గతంలో కూడా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పలు నియామకాలు చేపట్టింది. 2025 ఫిబ్రవరి నెలలో డీఆర్ఎఫ్ లోకి 357 కొత్త ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించింది. ఈ ఉద్యోగులు అంబర్ పేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో వారం రోజుల శిక్షణ అనంతరం ఫీల్డ్ లోకి పంపారు.

**పోస్టుల వివరాలు ఎలా ఉన్నాయి:**

మొత్తం పోస్టుల సంఖ్య : 200

అర్హతలు: తెలంగాణలో గతంలో విడుదలైన పోలీస్ రిక్రూట్మెంట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని ఫైనల్ రాత పరీక్ష రాసి, ఎంపిక కాని అభ్యర్థులకు ప్రాధాన్యత.

**ఉద్యోగం పేరు: డ్రైవర్ పోస్టులు**

టెంపరరీ: ఔట్సోర్సింగ్ విధానంలో ఈ 200 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు.

ఎంత జీతం : విడుదలైన ప్రకటనలో జీతం వివరాలు తెలుపలేదు.


సెలక్షన్ ప్రాసెస్: ఎటువంటి రాత పరీక్ష లేకుండా అర్హతలు కలిగిన అభ్యర్థులకు అవుట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీ.

**నోటిఫికేషన్ ముఖ్యమైన తేదీలు:**

దరఖాస్తులు ప్రారంభ తేదీ : 19th మే, 2025.

దరఖాస్తులు ఆఖరి తేదీ : 21st మే, 2025

దరఖాస్తు ఫీజు: ఎటువంటి ఫీజు లేదు






# మంత్రి పదవి కోసం కొత్త ఎత్తులు..

- ముఖ్య నేతలను మంచి చేసుకునే పనిలో రాజగోపాల్‌రెడ్డి!
- సీనియర్లతోనూ సత్సంబంధాలు
- మారిన వైఖరిపై కాంగ్రెస్‌లో చర్చ

**హైదరాబాద్ మే 19(సిద్దిపేట పవర్):**

మంత్రి పదవి కోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి సరికొత్త వ్యూహాలకు పదునుపెడుతున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారని అనుమానిస్తున్న పార్టీలోని పలువురు కీలక నేతలను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల నల్లగొండలో జరిగిన ఒక కార్యక్రమంలో మం త్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉన్నదని వ్యాఖ్యానించారని, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఒక కార్యక్రమానికి స్వయంగా ఆహ్వానించారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

నల్లగొండ జిల్లా రాజకీయాల్లో ఉత్తమ్, కోమటిరెడ్డి కుటుంబా ల మధ్య రాజకీయ సంబంధాలు అంతంత మాత్రమే. అయితే, ఏఐసీసీ ఉత్తమ్ అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తుండటం, ఆయనను మచ్చిక చేసుకొనేందుకు పొగుడుతున్నారని ఆయన అనుచరులు చెప్తున్నారు. మరోవైపు గుత్తా, కోమటిరెడ్డి కుటుంబాల మధ్య కూడా సఖ్యత లేదు. అయితే, అందరితో మంచిగా ఉండటం ద్వారా రాబోయే రోజుల్లో మంత్రి పదవి పొందడానికి ఎలాంటి అడ్డంకులు ఉండవనే ఉద్దేశంతోనే గుత్తాతో కూడా స్నేహ సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

సీనియర్ నేత జానారెడ్డి రాసిన లేఖ వల్లే తనకు మంత్రిపదవి రాకుండా పోయిందనే ఉద్దేశంతో ఆయనపై రాజగోపాల్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై జానారెడ్డి నేరుగా స్పందించకపోయినా.. అధిష్ఠానం ఈ వ్యాఖ్యలపై వివరణ కోరినట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. దీంతో జానారెడ్డి అంటే తనకు చాలా గౌరవమని, వ్యక్తిగతంగా ఆయనను విమర్శించలేదని రాజగోపాల్‌రెడ్డి చెప్పుకున్నారు. ఆ తర్వాత మళ్లీ జానారెడ్డిని మచ్చిక చేసుకునేందుకు ఆయన తనయులు ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారని, జానారెడ్డితో రాజగోపాల్‌రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయని ఆయన అనుచరులు చెప్తున్నారు.

# కాళేశ్వరం కమిషన్ గడువు మరోసారి పొడిగింపు

- కాళేశ్వరం కమిషన్ గడువు మరో రెండు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు
- మే 31తో ముగియనున్న కాళేశ్వరం కమిషన్ పదవీ కాలం
- బహిరంగ విచారణను ముగించినట్లు ప్రకటించిన కమిషన్ వర్గాలు
- విచారణ గడువును జూలై 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్ మే 19(సిద్దిపేట పవర్):**

కాళేశ్వరం కమిషన్‌లో బిగ్ ట్విస్ట్ నెలకొంది. కాళేశ్వరం కమిషన్ గడువు మరో రెండు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మే 31తో కాళేశ్వరం కమిషన్ పదవీ కాలం ముగియనుంది. బహిరంగ విచారణను ముగించినట్లు కమిషన్ వర్గాలు ప్రకటించాయి. కాళేశ్వరం కమిషన్ విచారణ గడువును జూలై 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. రాజకీయ నాయకుల విచారణ లేకుండానే నివేదిక ఇచ్చేందుకు కమిషన్ సిద్ధమైంది. పీసీ ఘోష్ కమిషన్ పదవీ కాలం పెంపుతో మళ్ళీ విచారణ కొనసాగించే అవకాశం ఉంది. కేసీఆర్, హరీష్‌రావు, ఈటెల రాజేందర్ ను విచారించేందుకే కాళేశ్వరం కమిషన్ పదవీ కాలం పొడిగించారంటున్న ఇరిగేషన్ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

కాగా, కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం కమిషన్ గడువును ఈ నెల 31 వరకు తెలంగాణ ప్రభుత్వం పొడిగించిన సంగతి తెలిసిందే. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో లోపాలపై విచారణ కోసం ప్రభుత్వం గత ఫిబ్రవరిలో కమిషన్‌ను నియమించగా, 100 రోజుల్లో నివేదిక సమర్పించాలని సూచించింది. ఆ తర్వాత క్రమంగా కమిషన్ గడువును పొడిగిస్తూ వచ్చింది. తాజాగా మరోసారి జూలై 31 వరకు గడువు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



మరోవైపు.. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిందని చెబుతున్నారు. బహిరంగ విచారణకు పొలిటికల్ లీడర్లను విచారణకు పిలువొద్దని కమిషన్ సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీంతో కేసీఆర్, హరీష్‌రావు, ఈటల రాజేందర్‌కు ఊరట లభించినట్లైంది. లీగల్ సమస్యలు రాకూడదనే ఉద్దేశ్యంతో వారిని విచారణకు పిలవకూడదని నిర్ణయం తీసుకుంది. డాక్యుమెంట్ ఆధారాలతో కమిషన్ ఫైనల్ రిపోర్ట్ ఇవ్వనుంది. దాదాపు 4వందల పేజీల రిపోర్ట్‌ను కమిషన్ తయారు చేసింది. ఈనెల 20 తర్వాత రిపోర్టు ఇవ్వనున్నట్లు తెలిసింది. కాగా.. అంతలోనే మరోసారి గడువు పొడిగించారు.

# సమస్యలు చెప్పుకోవడానికి వస్తే అరెస్టు చేస్తారా..

**హైదరాబాద్ మే 19(సిద్దిపేట పవర్):**

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగర్‌కర్నూలు పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డిని కలిసే ప్రయత్నం చేసిన చెంచు సోదరులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇదేనా ప్రజాస్వామ్యం, ఇదేనా మీ సోకాల్డ్ ప్రజాపాలన అని నిలదీశారు.

నల్లమల అడవుల నుంచి వచ్చానని గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి.. అడవి బిడ్డల సంక్షేమం పట్ల మీకు ఉన్న ప్రేమ ఇదేనా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. తమ సంక్షేమం కోసం ఐటీడీఏ పీవోగా ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని వారు కోరడం తప్పా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన పోడుపట్టా భూముల్లో సాగు చేసుకోనివ్వడం లేదనే విషయాన్ని మీకు తెలపాలని రావడమే వారు చేసిన తప్పా అని అడిగారు. తమ ఆరాధ్య దైవాల ద్వారా వచ్చే ఆదాయాన్ని తమ బాగు కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేయడం వారి తప్పా అని ప్రశ్నించారు. అక్రమంగా అరెస్టు చేసిన చెంచు ప్రతినిధులు మల్లికార్జున్, పద్మ గురువయ్యతో పాటు అమ్రాబాద్ పోలీసు స్టేషన్ లో నిర్బంధించిన చెంచులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




# వరి వేస్తే ఉరి కాదు.. వరి వేస్తే సిరి!

**మొదటిపేజీ తరువాయి**

సందర్శించిన సీఎం, తర్వాత బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతూ, నల్లమల బిడ్డగా ఈ గడ్డపై నుంచి మాట్లాడుతుంటే గుండె ఉప్పొంగుతున్నదని చెప్పారు.

**అభివృద్ధే లక్ష్యం**

అచ్చంపేట నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన విషయాన్ని రేవంత్ గుర్తు చేశారు. అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు అధికారులకు సూచనలు చేశానని, నియోజకవర్గంలో రైతులందరికీ సోలార్ పంపు సెట్లు అందిస్తామన్నారు. వంద రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.60 వేల కోట్లను రైతుల కోసం ఖర్చు చేసినట్టు వివరించారు.

**బీఆర్ఎస్‌పై నిప్పులు**

పోడు భూములపై పోరాటం చేసిన వారిని జైల్లో పెట్టిన చరిత్ర గత ప్రభుత్వానిదైతే, సోలార్ పంపు సెట్లను అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానిదని సీఎం రేవంత్ అన్నారు. సన్నాలు పండించే రైతులకు మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. వరి వేస్తే ఊరే అనే పరిస్థితుల నుంచి వరి వేస్తే సిరి అనే పరిస్థితులను కల్పించామని తెలిపారు. పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తూ వారి ఆత్మగౌరవం పెంచామని, రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మందికి అందిస్తున్నామన్నారు. అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని వివరించారు. తెలంగాణను దేశంలోనే ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడా లేని విధంగా ఏడాదిలో 60 వేల ఉద్యోగ నియామకాలను భర్తీ చేసినట్టు తెలిపారు. కొంతమంది తమ అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శలు చేశారు. కడుపునిండా విషం పెట్టుకుని విష ప్రచారం చేసే వారిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. "పేదల ఆకలి తీర్చే సన్న బియ్యం మేమేం చేస్తున్నామో గుర్తు చేస్తుంది. పాసు పుస్తకాలు చూసినప్పుడల్లా రైతులుకు రుణమాఫీ చేసిన రేవంతన్న గుర్తొస్తాడు.

బస్సులో ఉచిత ప్రయాణం చేసిన ఆడబిడ్డలకు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుతున్న పేదలకు మా ప్రభుత్వం చేసే మంచి పనులు ఎప్పటికీ గుర్తుంటాయి. ఎవరెన్ని కుట్రలు పన్నినా, తప్పుడు ప్రచారాలు చేసినా ప్రభుత్వ పథకాలే ప్రజలకు నిజాలను చెబుతాయి. అలాంటివారికి ప్రజలే బుద్ధి చెబుతారు" అని వ్యాఖ్యానించారు.



**పథకం ప్రారంభంపై సర్వత్రా హర్షం**

"ఇందిర సౌర గిరి జల వికాసం" పథకం ప్రారంభించడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోలార్ పంపు సెట్లతోపాటు పొలంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని అదనపు ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. పరిసర ప్రాంతాల గిరిజనులకు లబ్ధిదారులు పథకంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ పంపు సెట్ల స్థానంలో సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేయాలని సూచనలు చేశారు. వంద రోజుల్లో రైతులందరికీ సోలార్ పంపు సెట్ల ఏర్పాటు పూర్తి చేయాలని, ఇందుకోసం స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చెప్పారు.



# మూడురోజులు దీక్ష ఏర్పాటు చేసిన చక్రధర్ గౌడ్

**సిద్దిపేట పవర్:** నంగునూర్ హనుమాన్ మాలధారణ స్వాములు ఈ రోజు నంగునూర్ నుండి కొండగట్టు వరకు పాదయాత్రగా వెళ్తున్న స్వాములకు మూడు రోజుల దీక్ష ఏర్పాటు చేసినఘాదగోని చక్రధర్ గౌడ్ వారికీ వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాల తో ఉండాలని కోరారు.



# ఐటీఐ శిలాఫలకం ఇప్పటికి వెక్కిరిస్తుంది

**దుబ్బాక సిద్దిపేట పవర్ మే 19 న్యూస్**

నేను శాసనసభ్యుడుగా ఉన్నప్పుడు ఐటిఐ నూతన భవనం కోసం పనులు ప్రారంభిస్తే ఇప్పటివరకు పూర్తి కాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యమైనది అని మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఎంపీ రఘునందన్ రావు ,బిజెపి నాయకులతో కలిసి పర్యటించి నేను శాసనసభ్యులుగా ఉన్నప్పుడు నూతనంగా ఐటిఐ భవన నిర్మాణ పనులను పరిశీలించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని చూసి ఈ సందర్భంగా రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు..నేను శాసనసభ్యులుగా ఉన్నప్పుడు ఐటిఐ భవనం నిర్మాణం కోసం శతవిధాలుగా పోరాడి భవన నిర్మాణ ప్రయత్నాలు చేశానని అన్నారు.18 నెలలు కావస్తున్నా రెండో సంవత్సరం కూడా విద్యా సంవత్సరం మొదలవబోతుంది కానీ ఇంతవరకు ఐటిఐ భవనం పూర్తి కాలేదని అన్నారు.గత ప్రభుత్వంలో పలు దపాల్లో దుబ్బాక నిర్లక్ష్యానికి గురైందని చెప్పడానికి సాక్ష్యమే ఈ ఐటిఐ కాలేజీ అని అన్నారు.2018 జూన్ శిలాఫలకం ఇప్పటికి వెక్కిరిస్తుందని ఈనాటి పాలకులను అని అన్నారు.18 నెలలుగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ ఐటిఐ భవనాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆలోచన చేయకపోవడం అనేది బాధాకరమని అన్నారు. దుబ్బాక ప్రాంతం ఇప్పటి ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి ఒప్పుకున్నట్టు అప్పటి ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైంది ఇప్పటి ప్రభుత్వానికి కూడా నిర్లక్ష్యానికి గురైంది అని చెప్పినట్లు సజీవ సాక్ష్యం ఉంది అంటే ఈ ఐటిఐ బంగ్లానే అని అన్నారు. పక్కన టాటా గ్రూపు వాళ్ళు కట్టే భవన నిర్మాణం 18 నెలల్లో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ పూర్తవుతుంది ఐదు కోట్లు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం 2018 ప్రారంభించి ఏడు సంవత్సరాలు అవుతుంటే ఐటిఐ భవనం మాత్రం పూర్తి కాలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఐటిఐ భవనాన్ని పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమలో బీజేపి మండల అధ్యక్షుడు మంద అనిల్ రెడ్డి,మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, మాజీ పట్టణ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి,దిశ కమిటీ మెంబెర్ సుంకోజ్ ప్రవీణ్,రమణ రెడ్డి,దూలం వెంకట్ గౌడ్,ఆకుల నరేష్,సంపంగి అశోక్,గాజుల భాస్కర్,బాచి, సీనియర్ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





# 22 న హైదరాబాద్ లో మరసం సామాజిక సదస్సు

**"అందాల పోటీలు " వ్యాపార సంస్కృతి అంశం పై సదస్సు**

**సిద్దిపేట, మే 19**

మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22 న హైదరాబాద్ లో "అందాల పోటీలు వ్యాపార సంస్కృతి" అనే అంశం పై సామాజిక సదస్సు నిర్వహిస్తున్నట్టు మంజీరా రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కె. రంగాచార్య, ప్రధాన కార్యదర్శి, కవి డాక్టర్ సిద్దెంకి యాదగిరి, తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు, కవి డాక్టర్ పొన్నాల బాలయ్య మరసం , ప్రముఖ కవి అలాజ్ పూర్ కిషన్, తెలంగాణ రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు తోట అశోక్, నందిని భగవాన్ రెడ్డి లు తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేశారు.. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగే ఈ సదస్సులో ప్రముఖ కవయిత్రి విమల ప్రధాన వక్తగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. సభలో ఆత్మీయ అతిథిగా ప్రఖ్యాత కవి, రచయిత, తెలంగాణ సాహిత్య ఆకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి లు హాజరవుతారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందని తెలిపారు.అందాల పోటీలు సమాజానికి ఈరకంగా ఉపయోగ పడేవి కావని వారు తెలిపారు. మహిళల్ని వ్యాపార వస్తువుగా చేయడం కోసం మాత్రమే అందాల పోటీలని అన్నారు. అందాల పోటీలకు తాము వ్యతిరేకమని చెప్పారు.హైదరాబాద్ లో జరిగే మరసం సదస్సుకు సిద్దిపేట జిల్లా నుండి, ఉమ్మడి మెదక్ జిల్లా నుండి కవులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్య లో హాజరు కావాలని కోరారు..



# స్థానిక సంస్థల ఎన్నికలలోపు చేర్యాల ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని జెఏసి డిమాండ్

**చేర్యాల, మే 19 (సిద్దిపేట పవర్)** గత తొమ్మిది సంవత్సరాలుగా ఈ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీగా అనేక ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోక వడం వల్ల ప్రభుత్వాలపై ప్రజలకు విశ్వాసం లేదని వెంటనే చేర్యాల ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని చేర్యాల అఖిలపక్ష జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది స్థానిక చేర్యాలలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లిగారి యాదగిరి అధ్యక్షతన జరగగా ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగుల్ల పరమేశ్వర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలోగా చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు గతంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ మినిస్టర్ను ఈ జేఏసీ కలిసిందని అదే విధంగా అసెంబ్లీ సాక్షిగా చేర్యాల రెవెన్యూ డివిజన్ కేంద్రం పై చర్చ జరిగిన ఇప్పటికీ ప్రకటించకపోవడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు వెంటనే చేర్యాల అను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు , ఎక్స్ జెడ్పిటిసి గిరికొండల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేర్యాల ప్రాంతం పై అవగాహనతో ఉందని కచ్చితంగా చేర్యాల ప్రాంతం రెవెన్యూ డివిజంగా ప్రకటించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉంటుందని అన్నారు దానికోసం త్వరలో ఎంపీ గారిని అదేవిధంగా వివిధ శాఖల మంత్రులను ఈ జెఏసి కలుస్తుందని తెలియజేశారు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి , అందే బీరన్న మాట్లాడుతూ అధికార పార్టీతో ఏర్పడిన జేఏసీ అధికార పార్టీని ఒప్పించి రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయించాలని ఆయన ప్రధానంగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎక్స్ జెడ్పిటిసి కొమ్ము నరసింహారావు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూర్ణ ఆగం రెడ్డి సిపిఐ పార్టీ సిద్దిపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈరు భూమయ్య రామగల నరేష్ నీలం సన్నీ తుమ్మలపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ సిపిఎంఎల్ రెవల్యూషన్ నాయకులు రవి బాబు పాల్గొన్నారు

# యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు.... దుబ్బాక సిఐ శ్రీనివాస్.


**దుబ్బాక. సిద్దిపేట పవర్ మే 18 న్యూస్**



ప్రస్తుత సమాజంలో నేటి యువత, విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, ఆన్లైన్ గేమ్స్, ఐపీఎల్ బెట్టింగ్లకు దూరంగా ఉండాలని దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం దుబ్బాక సర్కిల్ పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మత్తు పదార్థాలకు అలవాటు పడిన కొంతమంది యువతి, యువకులు, విద్యార్థులు వారి జీవితాలను నాశనం చేసుకొని, వారి తల్లిదండ్రులకు ఆవేదన మిగులుస్తున్నారన్నారు. ప్రస్తుత సెలవు దినాల్లో విద్యార్థుల యొక్క నడవడికను ఇంటి దగ్గర తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా జరిగే ప్రమాదాలకు బాధ్యత వారి తల్లిదండ్రుల దేనన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే, జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. మహిళలపై వేధింపులు, ఆకృత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ శుభకార్యాల సందర్భంగా ఫంక్షన్ హాల్స్ లో, ఊరేగింపుల్లో విచ్చలవిడిగా డీజే బాక్సులు పెట్టి, స్థానికులకు, అనారోగ్యంతో బాధపడే వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారనే అంశం తమ దృష్టికి వచ్చిందని, అతి త్వరలోనే డీజే బాక్సుల యజమానులతో సమావేశం నిర్వహించి అధిక డీజే ధ్వనులను కట్టడి చేస్తామన్నారు.భూ పంచాయతీలకు సంబంధించి సివిల్ కేసులు పోలీస్ స్టేషన్లో పరిష్కరించబడవని, వాటిని కోర్టులోనే పరిష్కరించుకోవాలని సూచించారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి

**దుబ్బాక సిద్దిపేట పవర్ మే 19 న్యూస్** నర్సింగ్ పట్టణ కేంద్రంలో గ్రామపంచాయతీ వద్ద ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న చెరుకుశ్రీనివాస్ రెడ్డి నార్సింగ్ మండలం లోని 5 మంది లబ్ధిదారులకు 2 లక్షల 19 వేల రూపాయిల విలువ చేసే చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని,ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ,లక్షల మందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలుస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నార్సింగ్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దుబ్బాక నియోజక వర్గంలో ఎవరు ప్రభుత్వ భూమి కబ్జా చెయ్యాలని చూస్తే ఊరుకునేది లేదు

**దుబ్బాక నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి**

**సిద్దిపేట:** దుబ్బాక నియెజకవర్గంలో ప్రభుత్వ భూమిని ఎవరు కబ్జా చెయ్యాలని చూసిన ఊరుకునేది లేదనీ దుబ్బాక నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.అక్బర్ పేట భూంపల్లి మండలం చౌదర్ పల్లి గ్రామంలో 294 సర్వే నెంబర్ లో ప్రభుత్వ భూమినీ కొందరు అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారనీ ఆరోపించారు. గతంలో ఎస్సీ కమిషన్ ద్వారా ప్రభుత్వం సేకరించిన భూమి ఎలా పట్టగా మారింది అని ప్రశ్నించారు.గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలోనీ ఈ అక్రమాలు జరిగాయనీ అన్నారు.బిఆర్ ఎస్ ప్రభుత్వం లో ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు అమ్మితే కొనుగోలు చేశామని చెప్తున్నారనీ అన్నారు.ఎస్సిలకు ఇవ్వాల్సిన భూమిని కొనుగోలు చేశారనీ మండిపడ్డారు. కొందరు బడా బాబుల చేతుల్లోకి ప్రభుత్వ భూములు వెళ్ళాయన్నారు.గతంలోనే ఈ భూములపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ కు దరఖాస్తు చేసామనీ తెలిపారు. ఎనెగుర్తి గ్రామంలో కూడా పెద్ద ఎత్తున భూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారనీ పేర్కొన్నారు. చౌదర్ పల్లి భూ అక్రమాల పై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ చేయిస్తామన్నారు.దోషులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలనీ పేదల భూమి గుంజుకునే ప్రయతం చేస్తే కాంగ్రెస్ పార్టీ ఉరుకోదన్నారు.ధరణి ద్వార జవాన్ భూమి మార్పిడి చేసి కబ్జా చేశారు.జవాన్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందనీ తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామి గౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ

**యం ఈవో యం.మాధవరెడ్డి**


**సిద్దిపేట పవర్ గజ్వేల్ టౌన్ :** జగదేవపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మే 20 నుండి 24వరకు వృత్యంతర శిక్షణ జగదేవపూర్ బాలికల పాఠశాల యందు ఉంటుందని మండల విద్యాధికారి యం మాధవరెడ్డి మండల వనరుల కేంద్రం లో ఏర్పాటు చేసిన యం ఆర్ పి ల సన్నాహక సమావేశంలో తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణ లో ఈ విద్యా సంవత్సరం పాఠశాల కార్యక్రమాలు ఎఫ్ ఎల్ ఎన్ అన్ని పాఠ్య పుస్తకాల పాఠ్యంశ నిర్మాణ క్రమం పై పూర్తి అవగాహన కల్పిస్తూ, కృత్యాధారణ బోధన పై పూర్తి అవగాహనా కల్పిస్తూ ఉపాధ్యాయుల్లో ఉన్న బెస్ట్ ప్రాక్టీసెస్ ను ప్రదర్శిస్తారని దీనికి ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ జి టీ లందరు తప్పకుండ హాజరు కావాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో యం ఆర్ పి లు శంకర్ భాస్కర్ శివప్రసాద్ సి ఆర్ పి లు దయానంద్, రమణ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ చైతన్య స్కూల్ పై చర్యలు తీసుకోవాలి

**సిద్దిపేట పవర్ చేర్యాల:**

ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చేర్యాల లో యదేచ్చగా నడుస్తున్న కార్పొరేట్ శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి కలిసి వినతిపత్రం అందజేసిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (AISF ) సిద్దిపేట జిల్లా నాయకులు.




# రెండు బండ్లు,తులం బంగారం, 20 తులాల వెండి చోరీ

**సిద్దిపేట కొమురవెల్లి 19మే** ఆదివారం18.05.2025 మధ్యరాత్రి, వేచరేణి గ్రామంలో గల ఇగుర్ల యాదవ్వ గారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బీరువాలో ఉన్న తులం బంగారం,20 తులాల వెండి దొంగలించినారు. వారి ఇంటి ముందు పార్కు చేయబడిన రెండు బండ్లు (టీవీఎస్ ఎక్సెల్ మరియు ప్యాషన్ ప్రో) లను కూడా ఎత్తుకెళ్లినారు. ఇట్టి విషయమై కొమురవెల్లి పిఎస్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనది.

# సిద్దిపేటలో ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు అదృశ్యం

**సిద్దిపేట:** పట్టణంలోని ఖాదర్పుర వీధిలో నివసించే ఓ కుటుంబంలోని ఐదుగురు అదృశ్యమయ్యారు. శనివారం ఉదయం నుంచి వారు కనిపించట్లేదు. ఫోన్లను ఇంట్లోనే వదిలేసి వెళ్లారు. స్థానికులు, బంధువులు ఏదైనా ఊరికి వెళ్లారని అనుకొని ఊరుకున్నారు. కానీ, రెండ్రోజులైనా వారి జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరబత్తిని బాలకిషన్‌కు అప్పులు ఉన్నాయని, తనకు డబ్బులు ఇచ్చేవారు ఇవ్వకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నట్లు లేఖ రాసి పెట్టారని బంధువులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలకిషన్ తండ్రి జనార్దన్, భార్య వరలక్ష్మి, కుమారుడు శ్రావణ్, కుమార్తెలు కావ్య, శిరీష కనిపించట్లేదని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వారి ఆచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఏసీపీ మధు తెలిపారు.





## చట్టాలపై అవగాహన అవసరం

**సిద్దిపేట అర్బన్:**

త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని " తడ్కపల్లి గ్రామంలో" ఉపాధి హామీ కార్మికులతో వారు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి సైబర్ నేరాల గురించి గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక రుగ్మతల గురించి అవగాహన కల్పించిన సిద్దిపేట షీటీమ్ బృందం ఏఎస్ఐ కిషన్, మహిళా కానిస్టేబుల్ మమత, కానిస్టేబుల్ ప్రవీణ్ అవగాహన కల్పించారు. మహిళలకు ఏ రకమైన ఇబ్బందులు జరిగిన మహిళలు మౌనం వీడి పోలీసులకు తెలియపరచాలని కోరారు. మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుంది. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అపరిచితుల వ్యక్తుల మాటలు నమ్మవద్దు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అమాయక ప్రజలను చూసి ఇది ఇస్తాము అది ఇస్తాము కొన్ని డబ్బులు పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయి అని మోసం చేసేవారు ఉంటారు జాగ్రత్తగా ఉండాలి. ప్రజలకు మహిళలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీటీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం మహిళల భద్రత మా ముఖ్య బాద్యత. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్కూల్ వెళ్లే పిల్లల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని సూచించారు. సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్ కు ఎంత దూరం ఉంటే అంత మంచిది సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉంది దానికి అలవాటు పడి బానిసలు కావద్దు సూచించారు. పిల్లలను వేసవికాలం అయినందున ఎటుపడితే అటు ఈతకు పంపవద్దని సూచించారు. రాత్రి సమయాలలో ఇంటికి తాళం వేసి ఇంటి ముందర లేదా డాబాపై పడుకునే అలవాటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళలు వ్యవసాయ పనులపై ఒంటరిగా వెళ్లేటప్పుడు వంటిపై బంగారం ఉంటే దొంగతనం జరిగే అవకాశం ఉంటుంది. జాగ్రత్త పడాలి మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే, అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షీటీమ్ నెంబర్ 8712667434 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## పిఏసిఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్



**సిద్దిపేట మే 19** సిద్దిపేట రూరల్ మండలం బండచర్లపల్లి గ్రామంలో గల పిఏసిఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల నుండి సేకరించిన వరిధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు హమాలీలా కొరత ఉందని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అదనపు కలెక్టర్ వెంటనే జిల్లా సహకార అధికారి మరియు స్థానిక తహసిల్దార్ తో మాట్లాడి హమాలీల సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాలు పడుతున్నందున ధాన్యం కేంద్రాలలో నిలువ ఉంటే వర్షానికి తడిసిపోయే ప్రమాదం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరిధాన్యాన్ని తేమ శాతం కొలిచి నిర్ణీత తేమశాతం రాగానే తూకం వేసి మిల్లులకు తరలించాలని అన్నారు. వరిధాన్యాన్ని మిల్లులకు పంపించేందుకు ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట డిఎం సివిల్ సప్లై ప్రవీణ్, జిల్లా సహకార అధికారి నాగేశ్వరరావు, స్థానిక డిప్యూటీ తాహసిల్దార్ రాజేశం తదితరులు ఉన్నారు.







## ఈనెల 28 న కిడ్స్ అథ్లెటిక్స్ జిల్లా ఎంపిక పోటీలు

**సిద్దిపేట మే 19**

సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28 న ఉదయం 8 గంటలకు స్థానిక స్టేడియం మైదానంలో అండర్ 8, 10,12 సంవత్సరాల బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్ , కర్రోళ్ల వెంకట స్వామి గౌడ్ తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి ప్రశంస పత్రాలు & పతకాలు. పాల్గొన్న వారికి ప్రశంస పత్రం అందజేయబడతాయి అన్నారు. అత్యంత ప్రతిభ కనపరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.వీరు వచ్చే నెల ఒకటో తారీకు జింఖాన గ్రౌండ్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఆసక్తి గలవారు. ఈనెల 27 న సాయంత్రం లోపు రిజిస్ట్రేషన్ చేసుకోగలరని తెలిపారు. పూర్తి వివరాలకు 8501977079 & 9704061543 పై నంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు.

# ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని సిద్దిపేటలో తిరంగా ర్యాలీ





**మోడీ నాయకత్వమే దేశానికి రక్ష. ఎంపీ రఘునందన్ రావు.**

**సిద్దిపేట ప్రతినిధి :** మోడీ నాయకత్వమే దేశానికి రక్ష అని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ, భారత సైనికులకు సంఘీభావంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో తిరంగ ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వర దేవాలయం నుంచి లాల్ కమాన్ వరకు సాగిన తిరంగ ర్యాలీలో ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ నాయకులు, ఆర్ఎస్ఎస్, భజరంగదల్, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, లాయర్లు జాతీయ జెండాను చేత పట్టుకొని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. లాల్ కమాన్ వద్ద ఏర్పాటు చేసిన సభ వేదిక వద్ద ఎంపీ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోడీ మేకిన్ ఇండియా నినాదం దేశంలోనే తయారైన క్షిపణులు శత్రు దేశాల క్షిపణులను కూల్చి వేశాయని తెలిపారు. దేశ క్షిపణి, రక్షణ వ్యవస్థ ను చు ప్రపంచమే నివ్వెరపోయింది అన్నారు. దొంగ దెబ్బ తీసిన పాకిస్తాన్ ముష్కర ముఖలకు ఆపరేషన్ సిందూర్ పేరిట ప్రధాని మోదీ నాయకత్వంలో సైనికులు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. కుహనా లౌకిక వాదుల కు తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదం గురించి ప్రపంచ దేశాలకు తెలిపేందుకు వెళ్లే బృందానికి పార్టీలు జెండా లకు అతీతంగా నాయకత్వం వహించే అవకాశం ప్రతి పక్ష నాయకులకు ఇచ్చిన ఘనత నరేంద్ర మోడీ దీ అన్నారు. ముష్కర ముఖాల నుంచి దేశాన్ని రక్షించుకోవడంలో ప్రతి ఒక్కరు ముఖ్యంగా యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, బీజేపీ నాయకులు దూది శ్రీకాంత్ రెడ్డి, నలగామ శ్రీనివాస్, కొత్త పల్లి వేణుగోపాల్, బాసంగారి వెంకన్న, కాసగొట్టు సంతోష్, అడ్వకేట్లు జనార్ధన్ రెడ్డి, తుంగ కనకయ్య, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి అయిత బాల్ రాజేశం, బజరంగ్ దళ్ ప్రతినిధి రాజారాం తదితరులు పాల్గొన్నారు.



## హిందూముస్లిం భాయీ భాయి.

**సిద్దిపేట పవర్:**

కొమురవెల్లి మండల గురువన్న పేట గ్రామంలో హనుమాన్ భక్తులకు ముస్లిం సోదరులు విందు ఇవ్వడం అనేది రెండు మతాల మధ్య ఉన్న సామరస్యానికి ఒక మంచి ఉదాహరణగ నిలిచాడు అదే గ్రామానికి చెందిన ముస్లిం సోదరుడు మహమ్మద్ అర్షత్ ఉదయం గురువన్న పేటలో హనుమాన్ భక్తులకు శ్రీ రామలింగేశ్వర స్వామి ర్యాలీఆలయంలో పండ్లు ,పాల బిక్ష ను అందించి భక్తితో హిందుత్వాన్ని చాటాడు.



సిద్దిపేట వాస్తవ్యులు ప్రముఖ వ్యాపారావేత్త సిరిపురం శివకుమార్ కుమారుడి వివాహ విందు కి హాజరైన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు.



## మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**సిద్దిపేట బ్యూరో:** గత నెలలో గుండెపోటుతో అకాల మరణం పొందిన చిరకాల స్నేహితుడు మల్లి పెద్ది రమేష్ కుటుంబానికి అండగా మేమున్నామంటూ ముందుకువచ్చి మైత్రి అన్న మాటకు సరైన నిర్వచనాన్ని అందించారు సాటి బాల్య మిత్రులు దుబ్బాక మున్సిపాలిటీ లోని లచ్చపేట 11వ వార్డు పరిధిలోని మలిపెద్ది రమేష్ మరణించగా అతని 10వ తరగతి బాల్యమిత్రులు స్నేహితుని కుటుంబానికి అండగా ఉండాలని సంకల్పించి ఆర్థిక సాయం అందించారు .మృతుడు రమేష్ తల్లి రాజవ్వ కు రూ.35000, భార్య విజయకు రూ 21116 , మొత్తంగా 56116 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు .ఈ సందర్భంగా, మిత్రులు మాట్లాడుతూ ఆప్తమిత్రుడు దూరమవ్వడం చాలా బాధాకరమన్నారు ... మిత్రుడు రమేష్ కుటుంబానికి ఎల్లవేళలా తమ వంతుగా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు .కార్యక్రమంలో బాల్యమిత్రులు ఎండి ఉస్మాన్, షాదుల్, శ్రీరాములు, డి శ్రీనివాస్, నాగేందర్, వై శ్రీనివాస్, సుధాకర్, రఘునాథ్, బదుగు బాలకిషన్, ఎర్రగుంట వేణు, తాళ్ళ రమేష్, 11వ వార్డు నాయకులు నందాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు .





సిద్దిపేట జిల్లా కేంద్రం లోని మోహిని పురా శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు - ఉత్సవాలకు విచ్చేసిన చిన్న జీయర్ స్వామి వారికి ఆలయం వద్ద స్వాగతం పలికిన హరీష్ రావు - శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఎదురుకొల్లు ఉత్సవం లో చిన్న జీయర్ స్వామి వారి తో కలసి పాల్గొన్న హరీష్ రావు





